కథా నిలయం
5891
శ్రీకాకుళం

# వాల్‌పేపర్

పీసీ తెరమీద అక్షరాలను మరోమారు చదివింది అమ్మ.

'మనమిద్దరం పెళ్ళాడితే ఎలా ఉంటుంది?' ఇంగ్లీషులో చదివి తెలుగులో అనువదించుకుంది.

ఆ ప్రశ్న అక్కడికి నాలుగు గజాల దూరంలోని ఓ కేబిన్‌లో మరో పీసీ మీద పుట్టింది.

సరిగ్గా – ఓ వారం రోజుల క్రితం ఆ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వ్యక్తిత్వ వికాసం మీద తరగతులు జరిగాయి. దానిని ఆ రంగంలో ఒక నిష్ణాతుడు నిర్వహించాడు. జీవితానికి సంబంధించినవీ, మనసుని ఒక పద్ధతిలోకి తీసుకువచ్చేవీ మాట్లాడాలంటే – ఆ మాట్లాడే మనిషి ఒక గురువు లాంటివాడు కావటం, కాషాయ వస్త్రాలు ధరించటం వంటివి – సాధారణంగా ఒకప్పటి అవసరం. ఈయన సూటు వేసుకున్నాడు. చక్కని ఆంగ్ల ఉచ్చారణతో – కంటికి కనపడని విషయాల మీద మాట్లాడుతూ – కంటికి కనిపించే విషయాల ప్రాధాన్యతను బోధపరిచాడు. వర్ణాశ్రమ ధర్మాల పేరు రాకుండా భారతీయ సంస్కృతిలో శ్రమ విభజన సాధించిన అద్భుతాలను విశదపరిచాడు. ఒకేరకం పనిచేసేవారు ఒకరినొకరు వివాహమాడటంలోని 'అభివృద్ధి'ని చూపించాడు. అతను చెప్పిన విషయాలలో... అవగతం చేసిన విలువలలో... అది ఒకటి అయినప్పటికీ, మూడొంతుల మంది ఉద్యోగులున్న ఆ కంపెనీలో వివాహం కాని వారిలో ప్రభావితులయిన వారిలో నాన్న ఒకరు.

ఆ ప్రభావంలో నాన్న ప్రశ్న లాన్ ద్వారా అమ్మకు చేరింది.

ఓ గంట గడిచాక, తీరిక దొరికినప్పుడు అమ్మ జవాబిచ్చింది.

"బహుశా బానే ఉండొచ్చు"

ఆ తర్వాత ప్రశ్నలూ జవాబులూ సాగాయి.

"ఎందుకు బావుండొచ్చు?"

"నా కెరీర్‌కి నువ్వు అడ్డంరావు–"

"నా కెరీర్‌కి నువ్వు అడ్డొస్తావా?"

"అది నువ్వు ఆలోచించుకోవాలి"

"నీ కెరీర్ గురించి మాత్రమే ఆలోచించావా?"

"అవును. నేను ఆడదాన్ని. నాకు అదే ప్రధానమైన ప్రియారిటీ!"

"వివరింపుము..." నవ్వు ఎమోటిన్‌ని చేర్చాడు.

"జోక్ కాదు. ఇంతకాలం ఆడదాని బుద్ధికి వినియోగం గృహం. ఇది నీలో, నాలో, సమాజంలో ఉన్న బలీయమైన భావన. దీనితో పోరాటం నాతోనే ఆరంభం కావాలి. నేను ఆరంభించాను. గృహం కాక నా బుద్ధిని వినియోగించే అవకాశం నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది. ఆ వినియోగం సక్రమంగా సాగుతున్నదనటానికి తూనిక కెరీర్. నువ్వు మగ వాడివి. నీ బుద్ధి వినియోగానికి నీకు చాలా అవకాశాలు దొరుకుతాయి."

"పడిపోయాను–"

"ఎక్కడ–"

"నీ బుద్ధి ముందు"

"అయ్‌సీ–"

"నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పాలనిపిస్తోంది. అనుమతిస్తావా?"

"ప్రేమించటానికి కారణం?"

"చాలా ప్రాథమికమైన ప్రశ్న. కాస్తంత సంక్లిష్టం చెయ్యి–"

"ప్రశ్నలు ప్రాథమికమైన కొద్దీ జవాబులు సంక్లిష్టమవుతాయి–"

"నీకు నీ కెరీర్ ప్రాధాన్యత అర్థమయిందంటే – నా కెరీర్ ప్రాధాన్యతను అర్థం చేసుకో గలవు"

"అఫ్‌కోర్స్ – కాని – మగవాడి కెరీర్‌లో ముందుకు వెళ్ళాలంటే – ఆయన గారి వెనక ఓ ఆడది ఉండాలన్న గాడిదగుడ్డు కబుర్లు – మగా, ఆడా తేడా లేకుండా– చెప్పడం నాకు తెలుసు"

"కరెక్ట్– అలా కబుర్లు చెప్పే ఆడవాళ్ళు సినిమాలకు తీసుకెళ్ళటం లేదని, హాలీడే రిజార్ట్సులో గడపటం లేదని భర్తలను వేయించుకు తినటం – నేను చూశాను."

"అసలు ఆడదాని కెరీరూ ఒక కెరీరేనా – ఏదో పది రూపాయలు సంపాదించి వేణ్నీళ్ళకు చన్నీళ్ళవాలి – కాలక్షేపం కోసం ఉద్యోగం చెయ్యాలి – అనే మగ పురుగులను నేను చూశాను."

"నేను మగే! పురుగునో కాదో చూసి చెప్పాలి."

"మగ అంటేనే మెదడుని దొలిచే పురుగు. ఇది నా మొదటి మోడల్. నిన్నలా చూద్దం తోనే మొదలెడతాను. నన్ను పెళ్ళాడే సాహసం ఉందా-?" నవ్వు ఎమోటికన్.

"అసలు నీకు పెళ్ళి చేసుకునే సాహసం ఉందా?" విచారం ఎమోటికన్.

అలా మొదలయింది అమ్మా నాన్నల పెళ్ళి ప్రస్తావన.

ఒకరి కెరీర్‌కి ఒకరు అడ్డం కారాదు. విచ్చలవిడితనం లేని స్వతంత్రం ఇద్దరికీ ఉండాలి. అన్నింటిలోనూ యిద్దరూ సమానులమే - ఇలా కొన్ని ఒప్పందాలతో ఇద్దరూ పెళ్ళికి సిద్ధ మయారు.

తాతా, బామ్మా యిద్దరూ సంతోషించారు. నెలకి అరవై వేలు సంపాదనతో వస్తున్న కోడలు శ్యమంతకమణిలా కనిపించింది బామ్మకి. హెడ్‌మాస్టరుగా పదవీ విరమణ చేస్తున్న తాతకి - వీడు యిలాగయినా సంసారస్తుడవుతున్నాడు. అంతా ఆ బాబా దయ - అనిపిం చింది.

'నెలకి పదివేలు పంపుతాను. ఒప్పుకుంటానంటేనే పెళ్ళి' అంది అమ్మ అమ్మమ్మ తాతయ్యలతో. వాళ్ళు మాట్లాడబోయారు. అమ్మ అవకాశం యివ్వలేదు. చివరికి అమ్మ మాటే నెగ్గింది.

పది లక్షల ఖర్చుతో హైదరాబాదులో పెళ్ళి జరిగిపోయింది. ఇద్దరూ చెరిసగం చేసుకు న్నారు. వాళ్ళిద్దరూ పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ హనీమూన్‌కి ఆరెంజ్ కౌంటీలో ఏర్పాట్లు చేసింది.

నేను నా ప్రయత్నాలు ఆరంభించాను.

అమ్మ ఆదమరుపుగా ఉన్నపుడు బొజ్జలోకి జారబడ్డాను.

నాన్న- నీ యిష్టం- అన్నాడు ఆన్‌సైట్‌కి యు.కే. వెళుతూ.

'నీకు కష్టంగా ఉండదా-?' అంది అమ్మ. అందమైనది అమ్మ మొహం. సంతోషం కళ్ళలో మెరుస్తుంది. ఆ రోజు అవి మెరవటం లేదు. నాన్నకి తెలుసు. ఎందుకో తెలియదు.

'నీ యిష్టమే నా యిష్టం. బిడ్డల విషయంలో ఆడదే సరయిన జడ్జి' అన్నాడు విమానా శ్రయంలో సెక్యూరిటీ చెకప్‌లోకి వెళ్తూ.

అమ్మ పెదాలు బిగించింది.

అబార్షన్ జరిగిపోయింది. అమ్మ బొజ్జలోంచి ఆస్పత్రి చెత్తలోకి పడిపోయాను.

అలా నాకు మొట్టమొదటిసారి ప్రపంచంలోకి రావటానికి వీసా దొరకలేదు.

## 2

మళ్ళీ నేను అమ్మ బొజ్జలో ప్రవేశించటానికి ఆరు సంవత్సరాలు పట్టింది. ఈ ఆరు సంవత్సరాలూ చాట్ ద్వారా మాట్లాడుకోటానికి అమ్మా నాన్నకి దొరికినంత సమయం నేరుగా

మాట్లాడుకోవటానికి దొరకలేదు.

ఎలాగోలా వాళ్ళు మాట్లాడుకున్న విషయాలలో - సమయం వెచ్చించటాన్ని ఓ కొల బద్దగా తీసుకుంటే - ఉద్యోగంలో మార్పు, ఇల్లు కట్టటం, మామ్మ అసంతృప్తి- మొదటి, రెండు, మూడవ స్థానాలలో ఉంటాయి. నన్నీ ప్రపంచంలోకి రానివ్వటం అనే విషయం వాళ్ళ మనసులలో ఉండిపోయింది గాని మాటల్లోకి రాలేదు. రాలేదు- అనటం కన్న రానివ్వలేదు - అనటం మరింత నప్పుతుంది.

ఉద్యోగం మారే అవకాశాలు ఇద్దరికీ వచ్చాయి. ఇద్దరూ కలిసి మారే అవకాశాలూ అం దులో ఉన్నాయి.

"డబ్బు ముఖ్యమే- అయితే అంతా డబ్బే కాదు-" అన్నది ఇద్దరి సామాన్యాభిప్రాయం.

'-పని. పని యిచ్చే ఛాలెంజ్. ఆ ఛాలెంజ్‌ని తీసుకొంటున్నపుడు కలిగే ఎక్సైట్‌మెంట్. అదే నన్ను డ్రైవ్ చేస్తుంది-" అంటాడు నాన్న ఆఖరు మాటగా.

పైకి అమ్మా ఒప్పుకుంటుంది. భారతీయులు డబ్బే ఊపిరిగా బ్రతుకుతారు- అన్న అభి ప్రాయాన్ని పరాస్తం చెయ్యాలని నాన్న అనుకుంటున్నదే అమ్మా అనుకుంటుంది.

అయితే- నాన్న ఏటిట్యూడ్‌లో పొరపాటున్నట్టు అమ్మకి అనిపించేది. ఆ పొరపాటేమిటో విశ్లేషిద్దామంటే అమ్మకి బెరుకు. ఆ పొరపాటుని నాన్నకి ఎత్తి చూపించితే - మగవాడయిన నాన్న ఎంచుకున్న మార్గంలో పోటీ నుంచి తను తప్పుకున్నట్టే- అన్నది అమ్మ భావన. జీవితంలో యితర అంశాల మీద అతని దృష్టి మరలితే - అతని కోసం తనూ దృష్టి మరలించుకున్నట్టు అమ్మ నమ్మించుకోగలిగేది. అయితే- అనేక యితర అంశాలను తను కోల్పోతున్నట్లు అనిపించినా, నాన్నతో ప్రస్తావించేందుకు అమ్మ ముందుకు రాలేదు. ఏమాత్రం నిలబడి నీళ్ళు తాగే అవకాశం వాళ్ళకి జీవితం యిచ్చినా - ఎప్పుడో ఒకప్పుడు ఏవో యితర విష యాలు వాళ్ళ ఫీలింగ్స్‌ని దాటి మాటల్లోకి రాగలిగి ఉండేవి.

ఆ ఇతర అంశాలలో ఇద్దరికీ డబ్బు - అనేది లేదు. దాన్ని ఎలా పెంచాలా అన్నది కూడా లేదు. ఒక పరిమితి దాటాక డబ్బు ప్రేరకం కాని స్థితిలోనే ఇద్దరూ ఉన్నారు.

ఇల్లు కట్టడం రెండవ విషయం. అందులో- కట్టడమా- వద్దా - ఎక్కడ - ఎంత బడ్జెట్ - అన్నవి చాలా తక్కువ సమయం ఆక్రమించాయి. ఇంటీరియర్స్ గురించి, ఇంటి నిర్మాణ పర్యవేక్షణకు ఎవరు ఎంత సమయాన్ని వెచ్చించాలన్నదాని గురించి వాళ్ళ మాటలు చాలా సమయాన్ని ఖర్చుచేసాయి. అమెరికా లిస్టింగ్స్‌లో ఉన్న వాళ్ళ కంపెనీ ఇచ్చిన షేర్లు బాగా ఉచ్ఛదశలో ఉండగా ఇద్దరూ అర్ధభాగం అమ్మేసారు. దాంతో ఎనభై లక్షలకు పైగా వచ్చింది. ఇది జరిగిన కొద్దినెలలకే 9/11 తర్వాత వాళ్ళ షేర్లు అధఃపాతాళానికి పడి పోయినా తేలుకుట్టినట్టు అనిపించింది కాని పాము కాటులా అనిపించలేదు. ఆరంభించిన రెండేళ్ళకు ఇల్లు పూర్తయింది. ఆలస్యానికి ముఖ్య కారణం ఆర్కిటెక్ట్ సమయాభావమే.

బామ్మ అసంతృప్తి వాస్తవికాంశం. న్యాయంగా అదే ప్రధానాంశం అవాలి. దానికి గురయినది అమ్మే. లక్షలు లక్షలు తెచ్చిపోస్తున్న కోడలిని – దేవతలా – చూసుకోవాల్సిన ఆర్థిక అవసరం బామ్మకి లేదు. పెరిగిన మధ్య తరగతి వాతావరణం – అంత సంపాదిస్తున్న మనిషి ఆడదే అయినా కోడలే అయినా – బాగా వినమ్రంగా ఉండాలన్న అంతరంగ నిర్దేశాన్ని మామ్మకీ యిచ్చింది. అది పెళ్ళయిన కొన్నాళ్ళవరకూ ఆవిడమీద పనిచేసింది. క్రమంగా అమ్మ పిల్లలని కనకపోవటం ఓ అపరాధంలా ఆవిడికి కనిపించసాగింది. ఆ అపరాధానికి కర్త అమ్మ మాత్రమే అన్న భావం ఆమెలో బలపడసాగింది. నిజానికి ఆ అపరాధం ఒక ముసుగు మాత్రమే! దాని వెనక ఉన్నది – పని. ఇంటిపని. వంటపని. మామ్మ చూస్తున్న లోకంలో పని అంతా కోడళ్ళు చేయటం – పర్యవేక్షణ అత్తలు చేయటం సామాన్య దృశ్యం. అది సర్వ సమ్మతంగా జరుగుతోంది. పని ఎవరు చేస్తే వారు – చేయించేవారి ఆధిపత్యం అంగీకరించటంగా – అందరిలాగే ఆవిడా అర్థం తీసుకుంది. అమ్మ తన లోపలి బట్టలను స్నానాల గదిలో వదిలేయటం వంటివి మామ్మకి తనను లోకువ చేయటంగా కనిపించేది.

'–సారీ అత్తయ్యా– ఆఫీసుకెళ్ళే తొందరలో మర్చిపోయాను. పనిమనిషికి చెప్పండి. తీసి వాషింగ్ మెషిన్‌లో వెయ్యమనండి. లేదా వదిలెయ్యండి. నేను వచ్చి చూసుకుంటాను. అందాకా మీరు మరో బాత్రూం వాడుకోండి–' అనేది.

మామ్మ ఆ రెండూ చేసేది కాదు. తనే తీసేది. తనే ఉతికేది. 'ఏం చేస్తానమ్మా నా కర్మ' అనేది వీలు చూసుకుని అమ్మకి వినిపించేలాగ. అమ్మకి అపరాధ భావన కలిగేది. పెరిగేది. అది భర్తతో పంచుకొనేది.

'–పోన్లే– ఈసారి అలవాటు మార్చుకో–' అనేవాడు.

అమ్మకి మండేది.

'మీ బట్టలు మీరు తీసుకుంటున్నారా– అది అత్తయ్యకి ఎందుకు తప్పుగా తోచదు–' అనేది.

విషయం మారిపోయేది. అది ఎందుకు తప్పుగా తోచదో నాన్నకి కూడా తెలీదు. దానిని గురించి కొంత ఆలోచించి; ఆ ఆలోచనను తల్లికి అర్థమయేలా చేసి; అంగీకరింప చేయాలని ఆమెలో మార్పు తేవాలని నాన్నా కొన్నిసార్లు యత్నించాడు.

కోడలు దెబ్బలాట వేసుకోటం కన్నా, కొడుకు నచ్చజెప్పబోవటమే మామ్మని ఎక్కువ ఉద్రిక్తపరిచి చివరకి కన్నీళ్ళుగా, వేడికోళ్ళుగా, శాపనార్థాలుగా– మొత్తం మీద పెద్ద రసాభాసగా ముగిసేది.

ఇద్దరమూ అసహాయులమే– అన్నది వాళ్ళిద్దరూ మాట్లాడుకోగలిగితే ఏదో సమయంలో గుర్తించగలిగేవారు. దాంతో కొంత స్వాంతన దొరికేది. వారిద్దరికీ అంత సమయాన్ని జీవితం

యివ్వలేదు. దాంతో ఎవరి పనుల్లో వాళ్ళు తమని తాము దాచుకోవటం, అసంతోష కరమైన విషయాలను తప్పించటం, తద్వారా ఎడం పెరగటం, పేరుకోటం జరిగింది. శరీరాల కలయికకు తగిన మానసిక స్థితి ఏర్పడకపోవటం, అది యివ్వగలిగిన స్వాంతన కూడా దొరకకపోవటం జరిగింది.

దానాదీనా-

నన్ను కనకపోవటం అమ్మ అపరాధంగా, దాన్ని అడ్డుకోలేకపోవటం నాన్న అసమర్థతగా కేంద్రీకరించుకుంది మామ్మ. కుక్కరు కూత టీవీ సీరియల్‌కి అడ్డం వచ్చినా అది కూడా అమ్మ అపరాధాల చిట్టాలో జమ అయిపోయేది.

ఈ ఆరు సంవత్సరాలలో-

అమ్మా నాన్న ఆనందించిన సందర్భాలు లేకపోలేదు. వారి కెరీర్‌లో హైకులు, పై హోదాలు వంటివాటిని సమానంగానే సెలబ్రేట్ చేసుకున్నారు. నగరంలో కొత్తగా వస్తున్న ప్రతి రెస్టారెంట్‌లోనూ ధనం వెదజల్లి గెట్ టుగెదర్‌లు చేసుకుని ఆనందం వ్యక్తం చేసుకున్నారు.

అంతేకాక- కంపెనీ ఏర్పాటు చేసిన సెలవు విహారాలలో గడిపారు. వారు బ్లాక్ చేసిన వన్‌డే ఇంటర్నేషనల్‌లో కుర్చీలలో గంతులు వేసారు. వారి మానసిక ఉల్లాసం కోసం పంపిన రిజార్ట్స్‌లో పునరారోగ్యం పొంది కెరీర్‌కి పునరంకితం అయ్యారు.

చిట్టచివరకి-

నన్ను కడుపున వేసుకొందుకు అమ్మకి కెరీర్‌లో కొద్ది గ్యాప్ దొరికింది. పై బాండ్ విడ్త్‌లోకి నాన్న కన్నా ముందు ప్రవేశించగలిగింది. నాన్న తనను కలుసుకున్నా ఫరవాలేదనుకుంది. ఆస్ట్రేలియాలో అమ్మ, జర్మనీలో నాన్న ఉండగా వాళ్ళ లాప్‌టాప్స్‌లో నా వీసాకు అంకురార్పణ జరిగింది. 9/11 ప్రభావం వెనకబట్టి ఇండియన్ సాఫ్ట్‌వేర్ రంగానికి బుష్ స్థిరత్వం దానం చేయటంతో వాళ్ళ ప్రయత్నాలకు ప్రోత్సాహం లభించింది.

అలా చాలా సంక్లిష్టమైన లెక్కకు అమ్మా, నాన్నా సంయుక్త పరిష్కారం సాధించేలోగా నేను అమ్మ కడుపున పడ్డాను. ఇద్దరు మానవుల సహజ వాంఛలో చాలామందికి జన్మ లభించితే - ఇద్దరు విద్యావంతుల తీరికలో ఒప్పందాలలో నాకు వీసా లభించింది.

నేను పుట్టేసాక - ఎలాగూ సెలవు తీసుకోక తప్పదు గనక - ఈలోగానే తన వృత్తిగా, వ్యావృత్తిగా, ప్రవృత్తిగా పెనవేసుకున్న ఉద్యోగంలో మూడు నెలల ఖాళీని భర్తీ చేయటానికి అమ్మ రాత్రింబవళ్ళు కంప్యూటర్‌ని కావలించుకుంది.

ఆ కావలింతలలోనే బొజ్జలో నేను కాళ్ళు జాపుతుంటే, ఒళ్ళు విరుచుకుంటే కలిగే మధురమైన వొప్పిని అనుభవించింది. నా తొలి రూపాన్ని డాక్టర్లు స్కాన్ చేసి టేప్ చేస్తే దాన్ని తన పీసీలో వాల్‌పేపర్‌గా స్క్రీన్‌సేవర్‌గా అమర్చుకుంది. ఏ నెలలో నేను ఎలా

ఉంటానో, నేనూ తనూ కలిసి ఎంత బరువవుతామో, నెట్‌లో వెదికి చదివి తెలుసుకుంది. పుట్టాక నన్ను ఎలా పెంచాలో, నాకు ఏ జబ్బులు రావచ్చో, వాటికి ఏ మందులు వాడవచ్చో, ఏ జోల పాటలు పాడవచ్చో ప్రతిదీ నెట్‌లోనే తెలుసుకుంది. పని నుంచి మార్పే విశ్రాంతి అన్న ఆలోచనతో, అలాంటి విశ్రాంతిగా నా గురించి ఎంతో సమాచారాన్ని సేకరించింది.

నాన్న కూడా నా రాకకి కొంత తయారయాడు. నేను ఏ రోజున ఏ క్షణాన పుడితే నా జాతక చక్రం అద్భుతంగా ఉంటుందో ముందే అంచనా వేసాడు. కస్టమర్ల తృప్తే మా తృప్తి అనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో, ఆ మాటని తు.చ. తప్పించకుండా పాటించే వైద్య నిష్ణాతులను గురించి ముందే ఆరాలుతీసి అలాంటిచోట అమ్మ ఆరోగ్యానికీ, ప్రసవానికీ ఏర్పాట్లు చేసాడు. అవసరమయితే నా పుట్టుకను కాస్తంత సరయిన క్షణానికి జరిగేట్టు సిజేరియనో, మరో టెక్నిక్కో చేసిపెట్టగల సేవా హృదయం గల డాక్టర్‌ని ఎంచుకున్నాడు. మా ముగ్గురి జాతక చక్రాలకూ సరిపోడాలూ, సరిపోకపోడాలూ మధ్య ప్రిడిక్షన్స్‌లో ఆనంద విషాదాలు పొందాడు. తన ప్రిడిక్షన్స్‌లో సంతోషకరమైన వాటిని తీరిక దొరికినపుడు అమ్మతో పంచుకున్నాడు.

నేను మగబిడ్డనేనన్న ఆనందంతో మామ్మ అమ్మ అపరాధాల లిస్టును బాగా తగ్గించింది. అంతా గమనిస్తూ – మధ్య మధ్యలో నిర్లిప్తంగా పెదవి విరుస్తూ – తన కళ్ళముందే వడి వడిగా మారిపోతున్న ప్రపంచ స్వభావాన్ని అర్థం చేసుకోటానికి – అంతగా సరిపోని తెలుగు సాహిత్యంతోనే తన ఆవేశాలను పంచుకోజూస్తూ విడమరుచుకోజూస్తూ ఎదురు చూస్తున్నాడు తాత.

అంతా సక్రమంగా ఉన్నపుడు నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.

డాక్టర్లు యిచ్చిన తేదీకి నెలా పద్దెనిమిది రోజుల ముందే నేను అమ్మ బొజ్జలోంచి బయటకు రాబోయాను.

సరాసరి కంపెనీ ఏసీ గదిలోని కంప్యూటర్ ముందునించి ఆస్పత్రి ఏసీ గదిలోని కంప్యూటర్ ముందుకు అమ్మను చేర్చారు.

నాలుగ్గంటల తర్వాత ఆపరేషన్ చేసి చనిపోతున్న అమ్మనుంచి నన్ను వేరుచేసి ఇంకుబేటర్‌లోకి చేర్చి శిశువైద్యుడికి అప్పగించి తన గదిలో కూర్చుని – దైవం నా విద్యను ఓడించింది – అని కన్నీళ్ళు పెట్టుకుంది డాక్టరు.

## 3

"వీడు హంతకుడు. నా ప్రాణాన్ని నా నుంచి తీసుకుపోయాడు" అన్నాడు నాన్న.

అమ్మ కడుపులో మరికొన్నాళ్ళు ఉండి ఆమె యిచ్చే వెచ్చదనంతో మరికొంత ఎదగవలసిన నేను కృత్రిమంగా అందుతున్న వెచ్చదనంతో నా ప్రాణం నిలబెట్టుకోడానికి పెనుగులాడుతున్న నేను... నా బుల్లి చేతులను పూర్తిగా విప్పలేని నేను.. నా లేత కళ్ళను పూర్తిగా

తెరవలేని నేను.. అమ్మను ఎలా చంపగలిగాను?

ఈ ప్రశ్న నాన్నకి కలగలేదు.

నా శిరసు అమ్మనుంచి బయటకు రాలేదు. నా శరీరం అమ్మ నుంచి సహజంగా వేరు పడలేదు. మరికొద్ది సమయం వైద్యులు నిరీక్షించి ఉంటే - అంతవరకూ తప్పుడు గదులలో ఉన్న గ్రహాలు సరయిన గదులలోకి వచ్చి ఉండేవి. అప్పుడు నా పుట్టుక రికార్డు అయి ఉంటే నాన్నకి చాలా ప్రశ్నలు కలిగి ఉండేవి. ఇంత అద్భుతమైన ఘడియలు నాకు దక్కి ఉంటే - నా తల్లికి గండం ఉండేది కాదు. నాకు మరో తమ్ముడూ, చెల్లాయీ పుట్టి ఉండే వారు. అంతేకాదు- అప్పటికే చనిపోయిన అమ్మ ఆమె కడుపులోనే కన్నుమూసిన నేనూ ఆయన జాతక చక్రానికి పెద్ద సవాలుగా కలకాలం బ్రతికి ఉండేవాళ్ళం. అలా ఏమీ జరగలేదు. డాక్టర్లు నిరీక్షించలేదు. నేను ప్రాణాలతోనే అమ్మ కడుపులోంచి బయటపడ్డాను. పుట్టకుండానే హంతకుడినయిపోయాను.

నా తొలి రూపునీ, తొలి చూపునీ, తొలి కదలికనీ, తొలి ఏడుపునీ బంధించటానికి నాన్న తెచ్చిన హేండీకామ్ ఆయన సంచీలోనే లాప్‌టాప్ పక్కనే ఉండిపోయింది.

'వీడి మొహం చూడను-' అనేసి పట్టరాని దుఃఖాన్ని పట్టుకోటానికి నాన్న వెళ్ళి పోయాడు.

అమ్మమ్మా, తాతయ్యా కన్నీరు మున్నీరుగా ఉన్నారు.

మామ్మా తాతా వాళ్ళని వాళ్ళు ఓదార్చుకుంటూ గర్భశోకాన్ని అనుభవిస్తున్న ఆ ముసలి దంపతులను ఓదారుస్తున్నారు.

నా లేత చేతికి కట్టిన గుర్తింపు చీటీలోఅమ్మ పేరు చూసినపుడల్లా అమ్మమ్మకి తట్టుకో రాని దుఃఖం. తట్టుకుంది. మంచినీళ్ళను ఒంటె కడుపులో దాచుకున్నట్లు దుఃఖాన్ని దాచు కుంది. నేను ఏడుపు ఆపి నిద్రలోకి జారుకున్నాక ఆమె మెలకువలోకి వచ్చి దాచుకున్న దుః ఖాన్ని బయటకు రానిచ్చి నాకు నిద్రాభంగం కలగకుండా ఏడిచింది.

'ఇంక ఫరవాలేదు - వీడు వాడి బ్రతుకు వాడే బ్రతుకుతాడు - ఇంటికి తీసుకు పోవచ్చు-' అంది ఆస్పత్రి.

నన్ను తీసుకుని నలుగురు ముసిలాళ్ళూ అమ్మా నాన్నల 'స్వప్న' గృహం చేరారు. అమ్మ గదిలో- అమ్మ మంచం మీద - పాత గుడ్డల వెచ్చదనంలో అమ్మమ్మ పక్కలో చేరాను.

ఇన్నాళ్ళూ ఆస్పత్రి ముఖం చూడని నాన్న ఆరోజు ఇంటి ముఖం కూడా చూడకుండా ఆఫీసులో ఉండిపోయాడు. మూడు రోజులపాటు గదిలో ఉండిపోయిన నాన్నని అలా ఉండిపోనివ్వలేదు ఆయన లోకం. ప్రపంచం నలుమూలలా ఉన్న స్నేహితులు పలకరిస్తూనే ఉన్నారు. నీకు ఎప్పుడు రావాలంటే - అప్పుడొచ్చి పనిలో చేరు - అంది కంపెనీ. రెండో రోజునే ఆయన ఇంటిదగ్గర నుంచీ పని ఆరంభించాడు. మూడవ రోజునే అమెరికా వాళ్ళ

పగలే ప్రపంచానికి పగలయిన వేళ ఆయన కాన్ఫరెన్స్ కాల్సులో నోరుపెట్టాడు. అనిశ్చితిని వీలయినంత దగ్గరగా నిశ్చయించటానికి జరుగుతున్న ఆ సంభాషణలో నాన్న బుర్ర కూరుకుపోయి విషయానికి కంట్రిబ్యూట్ చేసింది. భారతీయ మేధస్సు జీవన సుఖదుఃఖాలను అధిగమించగలగటాన్ని ఓ అమెరికన్ గుర్తించి హృదయ పూర్వకంగా టోపీతీసి అభివాదనం చేసాడు ఫోన్ ముందు.

నేను వచ్చానని తాత ఫోను చెయ్యగా చెయ్యగా నాన్న వచ్చాడు.

వస్తూనే తన అభియోగాన్ని ఆధారాలతో సహా తాతకి వివరించాడు.

అమ్మ హంతకుడిని నేనే అన్న నిర్ధారణ నుంచి వెనక్కి వెళ్ళి నాన్న చాలా ఆధారాలు చూపించాడు. అమ్మ జాతకచక్రాన్ని బట్టి ఎలా లెక్కలు కట్టినా 83 ఏళ్ళుట. దాన్ని 32 ఏళ్ళుగా మార్చగలిగిన లెక్క నా పుట్టుకలోనే ఉందిట. తన లాప్‌టాప్‌ని తాతకి చూపించి ఆ రహస్యాన్ని విడమరుచుతున్నాడు. ఆయన మాసిన గడ్డాన్నీ, గుడ్డలనీ కంప్యూటర్‌లో జాతక చక్రాన్ని వేస్తూన్నపుడు ఆ కళ్ళలోని చురుకునీ గమనిస్తూ ఆ బుద్ధి జీవిలోని అసం బద్ధతకు ఆశ్చర్యపోతున్నాడు తాత.

పక్కనే ఉండి – 'నిజమేనండి – అల్లుడుగారూ–' అంటున్నాడు తాతయ్య.

'దీన్నిబట్టి తేలిందేమిటి?' అంటూ ఆగాడు నాన్న.

'నీకు పిచ్చి' అనుకున్నాడు తాత, అక్కడ నుంచి లేచివెళ్ళిపోతూ.

లోపలికి వెళ్ళి తల మొత్తుకున్నాడు తాత. 'నేను ఏ బిడ్డకీ జాతకాలు చూపించలేదు. పెళ్ళిళ్ళ కోణాలు కలుస్తాయేమోనని చూడలేదు. వీడికెలా వచ్చిందిరా ఈ పిచ్చి. బాబా! వీడిని నువ్వే మార్చాలి.'

పది పదకొండులు అమ్మ శ్రాద్ధకర్మలు శ్రద్ధగా చేసాడు నాన్న.

ఇరవై రోజుల తర్వాత – అంతా చూస్తూన్న అమ్మమ్మ.

"నేను వీడిని తీసుకుపోతాను అన్నయ్యగారూ!" అంది. తాతయ్య కూడా తాత చేతులు పట్టుకున్నాడు.

'వద్దమ్మా! చంటి బిడ్డా కంటికి దూరమైతే – వీడింక కోలుకోడు. మారడు–' అని పట్టుపట్టాడు.

ఆయన వియ్యంకునికీ వియ్యపురాలికీ నచ్చజెపుతూంటే మామ్మ కూడా మాట కలిపింది. ఆ తర్వాత ఊరుకుంది. ఇంకా భర్త వదలకపోటంతో 'ఓ మారు యిలా రండి' అని గదిలోకి తీసుకువెళ్ళింది.

'దీన్నే నేలది తీసి నెత్తికి రాసుకోటం అంటారు. నా బిడ్డకి – వాడంటే అసహ్యం – తీసుకుపోనీండి. ఎక్కడున్నా మన మనవడనే అంటారు. ఇంటి పేరేం మారిపోదు.

ఖర్చులంటారా - పారేద్దాం - వాళ్ళే పెంచుతారు - పెంచనీండి!' అంది.

'అది కాదే -' అంటూ ఏదో నచ్చజెప్పబోయాడు.

'నా మాట వినండి. వాడికి ఈసారి హౌస్‌వైఫ్‌నే చేస్తాను. సంతానం కూడా దగ్గర లేదంటే ఇచ్చేవాళ్ళూ క్యూ కడతారు. ఆ వచ్చింది వాడి సంగతులన్నీ అదే చూసుకుంటుంది. మనం ఈ వంటవాళ్ళ వంట తినలేక చస్తున్నాం. మనకీ వండి పడేస్తుంది-' అంది.

'అవునవును. నీ టీవీ సీరియల్స్‌కీ అంతరాయం ఉండదు.'

దాంతో ఆవిడ- 'అవును! నాకూ అరవై నిండాయి. మీ మగాళ్ళకేం - తిని కూర్చుంటారు. చాకిరి చేసే ఆడదాని కష్టం మీకెలా తెలుస్తుంది?! ఆ బిడ్డకి ముడ్డిగడుగు తెలుస్తుంది. చాకిరీ అంతా చెయ్యలేక నేను చావాలి. కాస్తంత నడుం వాలుద్దామంటే వీలుకావడంలేదు. పోనీ మీరన్నమాటే ఒప్పుకుందాం - టీవీ సీరియల్ చూద్దామని - ఆశపడితే - అది మీ మగ మహారాజులకి - దొడ్డ అపరాధంగా కనిపిస్తుంది' అంటూ చడామడా వాయించింది.

తాత వెనక్కి తగ్గలేదు.

'నువ్వు వంద చెప్పు. వెయ్యి చెప్పు. తల్లి ఎలాగూ లేదు. తండ్రి ఉండీ లేకుండా వాడు బతకటానికి వీల్లేదు-' అని తేల్చేసాడు.

'మీకు నా కష్టం ఎప్పుడు పట్టింది!' అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

'నువ్వేం చెయ్యనక్కరలేదు. నా మనవడు నాకు బరువుకాదు. వాడి ముడ్డిమీద నీళ్ళు కూడా నువ్వు పొయ్యనక్కరలేదు- అన్నీ నేను చేసుకుంటాను' అన్నాడు.

'చేసుకోండి - చేసుకోండి - నేనూ చూస్తాను - ఏమాత్రం వెలగబెడతారో-' అంది.

ఆ తర్వాత అమ్మమ్మను వదిలేసి తాతయ్య వెళ్ళిపోయాడు. అయిదో నెల వరకూ- నాన్న కోపాన్నీ, మామ్మ ధ్వనులనీ, గర్భశోకాన్నీ భరించి - అమ్మమ్మ నన్ను మోసింది. అమ్మే అయింది. అమ్మ ఇన్సూరెన్సు డబ్బు పది లక్షలు వచ్చినపుడు దాన్ని తీసుకెళ్ళి అమ్మమ్మ తాతయ్యల జాయింట్ ఎకౌంట్‌లో వేసాడు నాన్న. చిట్టచివరకు అమ్మమ్మ వెళ్ళి పోయింది.

'ఆవిడ ఉంది. తన పని చేసుకుపోయింది. నా డబ్బు తీసుకెళ్ళి దాని ఎదాన పోసాడు. - ఆ దిక్కుమాలిన కంప్యూటర్లో పడితే వాడికి మంచీ చెడ్డా తెలీదు. ఎదురుగ్గా ఈ దిక్కు మాలిన సంతని పెట్టబట్టే గుర్తుంది. ఇలా తగలేసాడు. తనకు తోచనయినా తోచాలి. ఎదిరి చెపితే విననయినా వినాలి. వాడినెందుకు అనటం - అంతా చేసింది మీరేగదా'- అంటూ తాతని పట్టుకుని దులిపేసింది.

అమ్మమ్మ వెళ్ళిన తర్వాత తాతే అమ్మమ్మ అయాడు. మాట మీద నిలబడ్డాడు. నాకు నీళ్ళుపొయ్యటం, పాలు పట్టటం, నా పాల సీసాలు ఉడకబెట్టటం, బట్టలెయ్యటం, నాపీలు మార్చటం, దొడ్డికెళితే ముడ్డికడగటంతో సహా ప్రతిదాన్నీ తనే చూసుకున్నాడు.

అందరూ వదిలేసిన నాకు ఆయనే సత్యం - అని పేరు పెట్టాడు. వెంపటాపు సత్యం అని తొలి నక్సలైటు ఉద్యమంలో నేలకొరిగిన నాయకుడు. తాతతో బాటు టీచర్స్ ఫెడరేషన్‌లో పనిచేసాడుట. ఆయనలా నేను నక్సలైట్‌కావాలన్న ఉద్దేశ్యం తాతకి లేదు. కాని- లోకంలో పోరుగువారిని పట్టించుకోవాలని, హేతువుకి మనిషి ప్రాధాన్యత యివ్వాలనీ అలాంటి మనిషిగా నేను ఎదగాలనీ ఆయన ఆశ.

నా బుడిబుడి నడకలు, బోసినవ్వులు, వచ్చీరాని మాటలు, చేష్టలూ నాన్నని ఆకట్టుకోలేక పోయాయి గాని - మామ్మ దగ్గరికి రాబోయింది. తాత ఎద్దేవాతో ఆమె వెనక్కి వెళ్ళిపోవడమే గాదు నా మీద వ్యగ్రతను మరింత పెంచుకుంది.

అలా నేను ఎదగసాగాను.

## 4

నాకు ఆరో ఏడు నడుస్తోంది.

ఏడాదికి ఎదురు నడిచాను. పదినెలలకే పలుకు నేర్చాను. చేత వెన్నముద్ద నాకు నేర్పి దాన్ని నాచేత అనిపించుకుని తాత టేప్ చేసుకున్నాడు. జనముద్దు పిల్లడిని. ఎక్కడికి వెళ్ళినా అంతా నా చుట్టూ ఉండేవారు. ఈ లోకమంతా ఒక ఎత్తు. తాత ఒక ఎత్తు. నాకు ఆయన అడుగులకు అరిసలొత్తలేకపోయాడు. పాకితే పరమాన్నం చెయ్యలేకపోయాడు. గడప దాటితే గారెలు వండలేకపోయాడు. అవన్నీ ఆయనకి వెలితి అయినా - నాకు ఉన్నంతలో ఏ వెలితీ లేకుండా పెంచాడు.

మూడో ఏడు నిండకుండానే ప్లేహోమ్‌లో చేర్చాడు. ఎల్‌కేజీలో ఉండగానే నాకూ నా తోటి పిల్లలకూ తేడా తెలియసాగింది - అందరికీ అమ్మా నాన్న ఉన్నారు. నాకు తాత మాత్రం ఉన్నాడు. అమ్మ ఏమయిందో తెలీదు. నాన్న మాటలను బట్టి - నేనే అమ్మను చంపేసాను. మామ్మ మౌనాన్ని బట్టి - అది నిజమే! తాత మాత్రం ఒప్పుకునేవాడు కాదు. ఎందుకో- తెలియదు.

కాని- నాన్నని చూడాలని ఉండేది. నాన్నతో ఆడాలని ఉండేది. ఆయనకి తెలీకుండానే చూడాలి. తిట్లకీ, దెబ్బలకీ తెగించే మాటలాడాలి. నాన్నని చూడాలంటే- కాస్త తిట్లు తిన కుండా ఎప్పుడయినా మాట్లాడాలంటే ఆయన కంప్యూటర్ ముందున్నపుడే చెయ్యాలి. నాన్న రూపానికి ఎప్పుడూ హెడ్‌సెట్ తప్పదు. ఇంటర్నెట్ మ్యూజిక్కో కాన్ఫరెన్స్ కాల్సో - ఎందుకో అందుకు అవి ఉండవలసిందే.

నాన్న లాప్‌టాప్‌లో, పీసీలో వాల్‌పేపర్స్ అన్నీ అమ్మవే! స్క్రీన్ సేవర్సన్నీ రకరకాల అమ్మ రూపాలే! ఆయన మరోరకమైన ఉద్యోగంలో ఉంటే ఏదో సమయంలో ఇతర అవస రాలు కలిగేవి. భార్య ఉంటే ఆవిడతో సమయం గడపవలసి రావటమనే బాధ్యత ఉండేది. తన అమలిన ప్రేమనూ అజరామర ప్రేమనీ ఆరేళ్ళపాటు చెక్కుచెదరకుండా కాపాడు కుందుకు

నాన్న ఉద్యోగం బాగా అమరింది. భార్యని తలుచుకుంటూ, నన్ను ద్వేషించు కుంటూ బ్రతకటానికి ఎలాంటి మార్పూ రాకుండా కొనసాగటానికీ నాన్న అలవాటు పడిపోగలిగాడు.

అయిదో ఏట - ఒకమారు - నా సహ విద్యార్థులు వాటర్ స్పోర్ట్స్ గురించి - కళ్ళు మెరుస్తూండగా - చెపుతూంటే - నాకు పట్టేసింది. నాన్న నన్ను తీసుకెళ్ళాలని ఏడుపు. నా ఏడుపు అంతగా పనిచెయ్యదని తెలుసు. ఆ ఏడుపు కేవలం దుఃఖమే. కోరిక తీర్చుకునే సాధనం కాదు. తాత కాస్తంత నలతగా ఉన్నాడు. ఆయనే తయారయాడు. మామ్మ - 'ఏడిచి చస్తే చావనీ- మీరు వెళ్ళొద్దంది.' తాత వినలేదు.

నాతో ఆడబోయాడు. పట్టుకోటానికి పరుగెత్తబోయాడు. ఆయాసం వచ్చింది. ఇంటికి పోదామంటే నేను ఏడుపు. చిట్టచివరికి మా డ్రైవరు మమ్మల్నిద్దరినీ యింటికి చేర్చాడు. ఆ తర్వాత ఆయన్ని ఆస్పత్రికి చేర్చాడు.

'-నువ్వు నా పెళ్ళాన్నేకాదు - నా తండ్రిని కూడా చంపుతావా - చావు! చావు!' అంటూ నాన్న నన్ను కాళ్ళు చేతుల్తో కుమ్మేస్తూ ఉంటే మామ్మ అడ్డుపడింది. నన్ను తాత గదిలోకి తోసి తలుపు వేసేసింది.

నాన్న కొట్టినందుకు ఏడిచాను కాని అంతకన్నా ఎప్పుడూ పక్కలో పెట్టుకునే తాత లేకపోయినందుకు ఆ రాత్రి భయంతో బిగుసుకుపోయాను. ఉచ్చతో మంచం తడిపేసాను.

అప్పటి నుంచి నన్ను బయటకి తీసుకువెళ్ళటానికి తాతకి ఆంక్షలు మొదలయ్యాయి. ఏడాదికోమారు ఆయనే నన్ను అమ్మమ్మా వాళ్ళ ఊరు తీసుకువెళ్ళేవాడు. నన్నొదిలిపెట్టి ఆయన వెళితే బెంగ. జ్వరం వచ్చేది.

కొన్నాళ్ళు మామ్మ మళ్ళీ పెళ్ళిచేసుకోమని నాన్నని పట్టుబట్టేది.

'ఈరోజు నేను ఉన్నాను. రేపు ఉండను. నీ బ్రతుకెలా గడుస్తుందిరా నాయనా' అనేది. నాన్న ససేమిరా అనేవాడు. చివరకి నన్ను కూడా ఓ అస్త్రం చేసింది. 'వీడికి తల్లినైనా తేరా' అంది. నాన్న ఖచ్చితంగా చెప్పాడు. 'ఇంకోసారి నువ్వు ఈ విషయం ప్రస్తావించితే వాడికి తండ్రి లేకపోవటమే గాదు - నీకు కొడుకు కూడా ఉండదు-'

'అంతా నా కర్మ' అని ఓ ఏడుపు ఏడిచి మామ్మ ఊరుకొంది.

ఆరోజు-

నాన్న మామూలుగానే కంప్యూటర్ ముందున్నాడు. నేను నా ప్రోగ్రెస్ కార్డుతో వెళ్ళి ఆయన దృష్టిలో పడటానికి ప్రయత్నిస్తున్నాను. ఆయన మొహాన్ని పట్టి పట్టి చూస్తున్నాను. కంప్యూటర్‌లో ఏదో ప్రోగ్రాం రన్ చేస్తున్నాడు. తలలోని డేటాని వేళ్ళతో కీబోర్డు ద్వారా ప్రోగ్రాంలోకి పంపుతున్నాడు. ఆయన మొహంలో ఏదో ఆనందం. ఎంతో ఆనందం. ఎంతో ఆనందం.

'నాన్న గారూ!'

'ఏంటి?' సౌమ్యంగా అన్నాడు.

ప్రోగ్రెస్ కార్డు యిచ్చాను.

సంతకం పెట్టేసి యిచ్చేసాడు.

నేను కదలలేదు. నాన్న చూపు నా మీద పడుతుందా అని చూస్తున్నాను. నా మనసు ఆగటంలేదు. ఆయన వేళ్ళు కీబోర్డు మీద నాట్యమాడుతున్నాయి. ఏదో అద్భుతాన్ని సాధిం చుతున్నట్లు ఆయన కళ్ళు మెరిసిపోతున్నాయి. నేను సాధించినదాన్ని నాన్న గుర్తించాలన్న నా కోరిక నా మనసును వశం చేసుకుంది. నా ఫస్ట్ రాంక్ నాన్నకి తెలియాలి. అది నన్ను పట్టి బంధించింది.

బర్ముడాలోంచి కనబడుతున్న ఆయన తొడమీద చెయ్యివేసి - కుదిపాను.

ఆయనకి ఏం జరిగిందో తెలియదు.

నాకు ఏం జరిగిందో తెలియదు.

ఆయన ఉగ్రంగా చెయ్యెత్తటం మాత్రం గుర్తుంది.

ప్రపంచం ఒక్కసారిగా మాయమయిపోయింది.

కళ్ళు తెరిచేసరికి కళ్ళ నీళ్ళతో తాత.

ఒళ్ళంతా జ్వరంతో పేలిపోతోంది. మధ్య మధ్యలో 'నాన్నా-నాన్నా' అంటున్నాను.

వాడి దగ్గరకు ఎందుకు వెళ్ళావురా కన్నా - ఆ రాక్షసుడు నిన్ను చంపినా చంపేస్తాడు - అంటున్న తాత మాటలు ఒకటీ అరా వినబడుతున్నాయి.

'తాతా - నే..ను... చచ్చిపోతున్నాను...' అంటున్నాను.

'వద్దురా తండ్రీ - చచ్చి ఏం సాధిస్తావురా-' అంటున్నాడు తాత.

మళ్ళీ మగత.

మళ్ళీ తెరిపి.

'చచ్చిపోతే - నేనూ - అమ్మనవుతా - నాన్న కంప్యూటర్‌లో వాల్‌పేపర్ అవుతా - నాన్న ఒళ్ళో కూర్చోబెట్టుకుంటాడు - నన్ను చూస్తాడు - నా కోసం ఏడుస్తాడు-' ఏదేదో అంటున్నాను.

తాతయ్య ఏడుపు నన్ను వెనక్కి లాగుతోంది.

వాల్‌పేపరవాలన్న కోరిక ముందుకి తోస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, 2005)